సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 9 । జూలై । 2023



సప్తగిరికాలనీ(కరీంనగర్): ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం సిద్దిపేట) అంతకపేట హైస్కూల్ 1985–86 బ్యాచ్ విద్యార్థులు 65 మంది రూ.8 లక్షలకు పైగా జమ చేశారు. పాఠశాలకు సుమారు రూ.లక్షన్నరతో వేదిక నిర్మించారు. రోటరీ క్లబ్ సహాయంతో రూ.1.60 లక్షలతో విద్యార్థులకు 30 సైకిళ్లు, కుట్టు మెషిన్లు అందించాలని నిర్ణయించారు. ఏటా పదోతరగతిలో 10 జీపీఏ, ట్రిపుల్ఐటీలో సీటు సాధిస్తున్న విద్యార్థులకు రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందిస్తున్నారు. తోటి మిత్రులు నలుగురు చనిపోగా వారి కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఆర్థికసాయం అందించినట్లు కరీంనగర్ సెక్టోరియల్ అధికారి కర్ర అశోక్ రెడ్డి, వ్యాపారి జనగామ పాపారావు తెలిపారు.

సండే స్పెషల్

- పూర్వ విద్యార్థుల వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు
- ఆత్మీయ సమ్మేళనాలే వేదికగా ఒక్కచోట చేరిక
- చదువుకున్న పాఠశాలలు, విద్యార్థులకు సామగ్రి వితరణ
- పేదలకు అండగా సేవా కార్యక్రమాలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న పలువురు చిన్నప్పటి దోస్తులు

స్నేహం.. సేవతో పదిలం

వారంతా చిన్నప్పటి దోస్తులు.. పాఠశాల విద్య పూర్తయ్యాక ఉద్యోగం, వ్యాపారం, వృత్తుల్లో స్థిరపడ్డారు.. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాల పేరిట చాలా ఏళ్లకు ఒక్కచోట చేరారు.. బాల్యమిత్రులను చూసి, భావోద్వేగానికి గురయ్యారు. క్షేమ సమాచారం తెలుసుకొని, తరగతి గదిలో చేసిన అల్లరి, చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. వారి ఆనందానికి అవధుల్లేవు. చాలాచోట్ల ఇలాంటి కార్యక్రమాల్లో కలుస్తున్నవారు తాము చదువుకున్న పాఠశాలకు, ఊరికి, పేదరికంలో ఉన్నవారికి సాయం చేయాలనుకున్నారు.. స్కూళ్లకు, విద్యార్థులకు సామగ్రి అందిస్తూ, ఊళ్లలో పలు నిర్మాణాలు చేపడుతూ, పేదలకు అండగా నిలుస్తూ.. వారి స్నేహాన్ని కలకాలం పదిలం చేసుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అలాంటి స్నేహితులపై 'సాక్షి' ఈ వారం సండే స్పెషల్ స్టోరీ.



తడగొండ స్నేహితుల ఔదార్యం

బోయినపల్లి(చొప్పదండి): స్థానిక హైస్కూల్ పూర్వ విద్యార్థులు, తడగొండకు చెందిన యువకులు కష్టాల్లో ఉన్న తమ స్నేహితులతోపాటు చుట్టుపక్కలవారికి సాయం చేస్తున్నారు. అనారోగ్యానికి గురైన తమ మిత్రుడు మధుకు దాతల నుంచి సేకరించి, రూ.72,500 అందించారు. తడగొండకే చెందిన పవన్కు స్నేహితులే వైద్యం చేయించారు. అయినా అతను బతకలేదు. అంత్యక్రియలు చేసి, బాధిత కుటుంబానికి రూ.70 వేల ఆర్థికసాయం అందజేశారు. ఇలా వారి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.



మిత్రుడి కుటుంబానికి అండ

ముస్తాబాద్(సిరిసిల్ల): స్థానిక హైస్కూల్ 1986–87 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు.. పేదరికంలో ఉన్న తమ స్నేహితులకు అండగా నిలుస్తున్నారు. శాదుపల్లి శ్రీనివాస్గౌడ్, ఆయన తండ్రి లక్ష్మీనారాయణ గుండెపోటుతో చనిపోయారు. శ్రీనివాస్గౌడ్ కుమారుడు దివ్యాంగుడు. భార్య బీడీలు చుడుతుండగా కూతురు డిగ్రీ మధ్యలోనే మానేసింది. వీరి దీనస్థితికి చలించిపోయిన పూర్వ విద్యార్థులు శనివారం రూ.62 వేల ఆర్థికసాయం అందించారు. తమ స్నేహితుడి కుటుంబానికి అండగా నిలుస్తామని దేవేందర్, హరికృష్ణ, యాదగిరిగౌడ్, శంకర్, శ్రీనివాస్, నారాయణ తెలిపారు.



బడికి బెంచీలు, వాటర్ ప్లాంట్

కోనరావుపేట(వేములవాడ): వట్టిమల్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు చెప్యాల రాజు, ఎండీ.షాదుల్లా, పాలకుర్తి మహేశ్, లకావత్ రాంరెడ్డి, లక్కె సుదర్శన్, గండి నరేశ్, 2014–15 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు కలిసి తాము చదివిన బడికి డెస్క్ బెంచీలు అందజేశారు. ఇతరుల సహాయంతో విద్యార్థుల కోసం ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.



నా నేస్తం చారిటబుల్ ట్రస్టు

ఎలిగేడు(పెద్దపల్లి): మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ 1987–88 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు 2013లో నా నేస్తం చారిటబుల్ ట్రస్టును స్థాపించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి కస్తూరిబా విద్యాలయానికి స్కౌట్స్ డ్రెస్‌లు అందించారు. ఎలిగేడు, ధూళికట్ట ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి ఫలితాల్లో మొదటి, రెండో స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు ఇస్తున్నారు. ఎలిగేడు మండల నిరుద్యోగ యువతకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ, లైసెన్స్ ఇప్పించారు. పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. ఎలిగేడులో బాడీ ఫ్రీజర్, వైకుంఠ రథం ప్రారంభించారు. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ట్రస్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంట శ్రీనివాస్, వెంగళదాసు అశోక్ తెలిపారు.



ఆర్థిక సాయం.. అన్నదానం

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలోని హైస్కూల్ 1986–87 బ్యాచ్ విద్యార్థులు రాజేశం, శ్యాం, శ్రీనివాస్, రవీందర్, కానుగంటి శ్రీనివాస్, కొట్టె శ్రీనివాస్ తదితరులు తమ మిత్రుడు బొంకూరి మధు కుమారుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా రూ.50 వేలు అందించారు. రామస్వామి అనే మరో స్నేహితుడికి కష్టకాలంలో నిత్యావసర సరుకులు అందజేశారు. కరోనా సమయంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని సుమారు 300 మంది పారిశుధ్య కార్మికులకు ఐదు కిలోల చొప్పున పండ్లు పంపిణీ చేశారు. వలస కార్మికులకు అన్నదానం చేశారు.



బాల్య స్నేహితులకు చేయూత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): స్థానిక జెడ్పీ హైస్కూల్ 1996–97 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు చేయూత మిత్ర ఫౌండేషన్ ద్వారా ఆపదలో ఉన్న తమ స్నేహితులకు రూ.5 లక్షల వరకు సాయం అందించారు. 1994–95 బ్యాచ్‌కు చెందినవారు బాల్యమిత్ర ఫౌండేషన్ ద్వారా తమ మిత్రుడు రేసు మోహన్‌కు ఉపాధి కోసం ఆటోను కొనుగోలు చేశారు. గొరిటెల కృష్ణ గుండెపోటుతో మరణించగా వారి పిల్లల పేరిట రూ.1,20,000 బ్యాంకులో డిపాజిట్ చేశామని సంస్థ అధ్యక్షుడు సందుపట్ల లక్ష్మారెడ్డి తెలిపారు. పూర్వ విద్యార్థులు, ప్రస్తుత ఎన్నారైలు సతీశ్, రుక్మయ్య, రమేశ్, ప్రదీప్, అశోక్ పాఠశాల అభివృద్ధికి దాదాపు రూ.6 లక్షలు ఖర్చు చేశారు.



విద్యార్థి దత్తత కార్యక్రమం

ధర్మపురి: ధర్మపురికి చెందిన గొల్లపల్లి గణేశ్ దివ్యాంగుడు. స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల (గతంలో యూపీఎస్)లో చదివి, అదే స్కూల్లో తెలుగు పండిట్‌గా పని చేస్తున్నారు. నిరుపేద విద్యార్థులు చదువుల్లో రాణించడానికి విద్యార్థి దత్తత అనే కార్యక్రమం ద్వారా చేయూతనిస్తున్నారు. దీనికి ధర్మపురికి చెందిన ఆయన మిత్ర బృందంతోపాటు ఎన్నారైలు సాయం చేస్తున్నారు. ఇప్పటివరకు 2,500 మంది నిరుపేద విద్యార్థులకు సుమారు రూ.15 లక్షల విలువైన విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఏడుగురు విద్యార్థినుల ఉన్నత విద్యాభ్యాసానికి సుమారు రూ.16 లక్షలు చెల్లించారు.



సమస్యలపై ఆరా.. తక్షణ స్పందన

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ హైస్కూల్ పూర్వ విద్యార్థి, బీర్‌పూర్‌కే చెందిన చిట్నేని విజయ్‌కుమార్ పాఠశాల పూర్వ విద్యార్థులు 150 మందితో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశాడు. అందరూ ఎక్కడ ఏ సమస్య ఉందని ఆరా తీస్తూ తక్షణమే సాయం చేస్తున్నారు. బీర్‌పూర్‌కు డెడ్‌బాడీ ఫ్రీజర్ అందించారు. బడిలో వాటర్ ట్యాంక్ నిర్మించారు. నలుగురు పేద విద్యార్థులకు రూ.50 వేల చొప్పున అందజేశారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామని విజయ్‌కుమార్, వేణు తెలిపారు.



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

కోరుట్ల రూరల్: పెద్దాపూర్ గురుకుల పూర్వ విద్యార్థి, వ్యాపారి చెన్నమనేని శ్రీనివాసరావు తాను చదువుకున్న విద్యాలయంలో విద్యార్థుల కోసం రూ.10 లక్షలతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మించారు. పాఠశాల అభివృద్ధి కోసం 1989–90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులతో ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి, సొంత ఖర్చులతో సిల్వర్ జూబ్లీ నిర్వహించారు. పూర్వ విద్యార్థులు గురుకులంలో వాటర్ ప్లాంట్ నిర్మించారు. విద్యార్థుల కోసం డెస్క్ బెంచీలు అందజేశారు.

రూ.20 లక్షలతో తరగతి గదులు



కోనరావుపేట(వేములవాడ): నిజామాబాద్ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న విద్యార్థులందరూ కలిసి పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి రిటైర్డ్ డీఎస్పీ గోగూరి మోహన్‌రెడ్డి అధ్యక్షుడిగా ఉన్నారు. పాఠశాలలో తరగతి గదుల కొరత ఉందని తెలుసుకొని, రూ.20 లక్షలతో రెండు గదులు నిర్మించారు. వాటిని 2022 డిసెంబర్ 2న అప్పటి సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, డీఈవో రాధాకిషన్ చేతులమీదుగా ప్రారంభించారు.

న్యూస్‌రీల్

మదర్‌థెరిస్సాలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



విద్యార్థులకు నియామకపత్రాలు అందిస్తూ..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ చేపట్టారు. నిసర్గ కంపెనీలో ఉద్యోగాలకు ప్లేస్‌మెంట్ నిర్వహించగా.. 25 మంది ఎంపికయ్యారు. వారికి కంపెనీ ఇచ్చిన నియామక పత్రాలను కళాశాల డైరెక్టర్ ఎడవల్లి నవత, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపేందర్ అందించారు. ఎంపికైన విద్యార్థులు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబయి, కోల్‌కత్తా బ్రాంచీలలో పని చేయాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికుల సమస్యలపై పోరాటం

గోదావరిఖని: ఆర్‌ఎఫ్‌సీఎల్ సమస్యలపై మజ్దూర్ యూనియన్‌తో కలిసి పోరాడుతామని ఐఎన్‌టీయూసీ నేత నర్సింహారెడ్డి తెలిపారు. శనివారం మజ్దూర్ యూనియన్ నాయకుడు అంబటి నరేష్‌తో కలిసి స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికులకు న్యాయమైన జీతాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తోందని, ఇది సరికాదని, కార్మికులందరికీ మెరుగైన వేతనాలు కల్పించాలని కోరారు. కార్మికులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే కొంతమంది మాటలు నమ్మొద్దన్నారు. నాయకులు గాండ్ల ధర్మపురి, వడ్డేపల్లి దాస్, వంగ లక్ష్మీపతిగౌడ్, నేరేటి సాగర్, తాటి రాజయ్య, మురళి క్రిష్ణ, నిమ్మల రవి, జక్కుల సతీశ్, గోలి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ రహస్య ఒప్పందం

- సింగరేణి, మినరల్ ఫండ్స్‌పై విచారణ జరపాలి
- పార్టీ ఫండ్ ఇస్తే ప్రైవేట్ వర్సిటీలకు అనుమతులు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ రామగుండంలోని టీవీ గార్డెన్స్‌లో రామగుండం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ దేశంకోసం, ధర్మంకోసం అనడం మానుకుని ముందుగా బీజేపీ నాయకులకు సంస్కారం నేర్పించాలని సూచించారు. మధ్యప్రదేశ్‌లో ఆదివాసి వ్యక్తిపై మూత్రవిసర్జన చేసిన, కులమతాల పేరుతో అసమానతలు సృష్టిస్తున్నందుకు ప్రధాని దేశానికి క్షమాపణలు చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం యూనిఫాం సివిల్ కోడ్ తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. వెంటనే యూనిఫాం సివిల్ కోడ్ వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో సింగరేణి, జిల్లా మినరల్ ఫండ్స్ నిధుల గురించి విచారణ జరిపించాలని కోరారు. సింగరేణి నిధులకు.. గజ్వేల్ జిల్లాకు ఏం సంబంధమని, సీఎం కేసీఆర్ తన నియోజకవర్గానికి ఎందుకు నిధులు తరలించుకుపోతున్నారని ప్రశ్నించారు. పార్టీ ఫండ్ ఇచ్చిన వారి ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతి ఇస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో పేదరికం, నిరుద్యోగం, దోపిడీ, కబ్జాలు, అనుమతి లేని వర్సిటీలు, కుంభకోణాలే కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ వచ్చాకా ఆంధ్రప్రాంతం నాయకులకే కాంట్రాక్టులు దక్కుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి అవినీతిలో ఎమ్మెల్యేలందరికీ పాత్ర ఉందని, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఇసుక దందా విపరీతంగా సాగుతోందని వివరించారు. బీఎస్పీ నాయకుడు దేవునూరి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన చిలుక రాంమూర్తి, ఎండీ.పాషాకు కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షుడు కాసిపేట స్వామి, జిల్లా పధాన కార్యదర్శి రాజనర్సయ్య, పంజాబాల కల్యాణ్, జింక ఉదయ్, జనగామ మల్లేశ్, విజయగిరి రాము, సిరికొండ సది, కాసర్ల పోశమల్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ టీ-9 టికెట్ సమయం పొడిగింపు

సుల్తానాబాద్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవల కోసం ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు గోదావరిఖని డిపో మేనేజర్ మల్లేశం తెలిపారు. పల్లె వెలుగులో ప్రయాణించే మహిళలు, సీనియర్ సిటిజన్‌లకు టీ-9 టికెట్‌ను గతనెల 18 నుంచి అందుబాటులోకి తెచ్చిందని, తాజాగా ఈ టికెట్‌పై ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ప్రయాణించే వెసులుబాటు కల్పించిందని తెలిపారు. టికెట్‌పై 60 కిలోమీటర్ల పరిధిలో ఒక్కసారి రాకపోకలు సాగించవచ్చని పేర్కొన్నారు. టికెట్ ధరను రూ.100గా సంస్థ నిర్ణయించిందని, టోల్‌టేట్ చార్జీలపై మినహాయింపు ఉంటుందని, ఒక్కొక్కరికి రూ.20 నుంచి రూ.40 వరకు ఆదా అవుతుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించేందుకు కాంబినేషన్ టికెట్ రూ.20 అందుబాటులోకి తెచ్చామన్నారు. 60ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్‌లు ఆధార్‌కార్డును ఆర్టీసీ కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సీనియర్ సిటిజన్‌లు, మహిళలు వినియోగించుకోవాలని కోరారు.

సింగరేణి ఉద్యోగులకు నిమ్స్‌లో ప్రత్యేక కౌంటర్



గోదావరిఖని: సింగరేణి, రిటైర్డ్ ఉద్యోగులకు వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లోని నిమ్స్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్లను డైరెక్టర్ ఫైనాన్స్ ఎన్.బలరాం, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, జీఎం (కో–ఆర్డినేషన్) ఎం.సురేశ్ శనివారం ప్రారంభించారు. ఔట్ పేషెంట్ బ్లాక్, మిలీనియమ్ బ్లాక్, స్పెషాలిటీ బ్లాక్‌లో సింగరేణీయులకు ప్రత్యేక ఓపీ కౌంటర్లను ఏర్పాటు చేశారు. సింగరేణి సిఫార్సు చేసిన కార్మికులు, సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డుల కలిగిన విశ్రాంత కార్మికులు నేరుగా డాక్టర్లను సంప్రదించే వీలుంటుందన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకుల తాత్కాలిక వసతి కోసం ప్రత్యేక భవనం కేటాయించామన్నారు. సింగరేణి డిప్యూటీ సీఎంవో డాక్టర్ బాలకోటయ్య, పీఆర్వో ఎస్.శ్రీకాంత్, డీఎంఎస్‌లు కేపీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీపీబీవో పరీక్ష



కమాన్‌పూర్: టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ (టీపీబీవో) ఉద్యోగాలకు మంథని జేఎన్‌టీయూలో నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 177మందికి 136 మంది హాజరైనట్లు వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

పేదల కోసం పాటుపడిన మహానేత



వైఎస్సార్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి నివాళి అర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్

- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్
- దివంగత వైఎస్సార్‌కు నివాళి

గోదావరిఖని: నిరుపేదల కోసం అహర్నిశలు తపించిన మహానేత వైఎస్సార్ అని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ అన్నారు. శనివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. ఆయన ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాట వేసిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అన్నారు. ఆయన మన మధ్య లేకున్నా ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో గోరింటాకు వేడుకలు



గోదావరిఖని: సింగరేణి సేవ ఆధ్వర్యంలో శనివారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. స్థానిక బంగ్లాస్ ఏరియాలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ఆర్జీ-1 సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

క్లుప్తంగా

'మక్కాన్‌సింగ్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి'

పాలకుర్తి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున రామగుండం బరిలో ఉంటున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపించాలని మక్కాన్‌సింగ్ సతీమణి మనాలిఠాకూర్ కోరారు. శనివారం పాలకుర్తి మండల పరిధిలోని గ్రామాల్లో మహిళాకూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. పేద ప్రజలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, మక్కాన్‌సింగ్‌ను గెలిపిస్తే పేదలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వాసుదేవరావు, గాదె సుధాకర్, మడ్డి తిరుపతి, అమ్ముల కుమార్, కోటేశ్, మహేందర్, రాకేష్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్‌ను బాధితుడికి ఇస్తున్న ఎస్సై

ధర్మారం: మండలకేంద్రానికి చెందిన మెడవేని శ్రీనివాస్ తన సెల్‌ఫోన్‌ను వారసంతలో పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ గుర్తించి బాధితుడికి శనివారం అప్పగించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. అప్పగించిన ఫోన్ విలువ సుమారు రూ.18వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

కిరాణదుకాణంలో చోరీ

సుల్తానాబాద్ రూరల్: పట్టణంలోని రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్న శ్రీలక్ష్మీ కొబ్బరి కాయల దుకాణంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. బాధితుడు బాపురావు కథనం ప్రకారం.. శనివారం ఉదయం దుకాణం తెరిచేందుకు వెళ్లగా తాళం పగులకొట్టి ఉందని, లోపలికి వెళ్లి చూడగా.. సిగరెట్ ప్యాకెట్లు, రూ.5వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపాడు. చోరీ విషయమై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు.

ముందస్తు సమావేశం

గోదావరిఖని: రక్షణ త్రైపాక్షిక ముందస్తు సమావేశాన్ని శనివారం ఆర్జీ–2 జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. త్రైపాక్షిక ఏర్పాట్లు, డీడీఎంఎస్ అధికారులు, యూనియన్ నాయకులు, అతిథుల ఏర్పాట్లపై చర్చించారు. ఇన్‌చార్జి ఎస్ఓటూ జీఎం బచ్చ రవీందర్, ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారి మధుసూదన్, వకీల్‌పల్లి ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని అశోక్‌నగర్‌కు చెందిన రైతు రౌతు రాజయ్య శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రాజయ్య కొంతకాలంగా మనస్తాపంతో ఉంటున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అప్పుడే ఇంటికొచ్చిన కొడుకు అతడిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించాడు. ప్రస్తుతం రాజయ్య పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

ఉపాధి శిక్షణ.. భవితకు నిచ్చెన



ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ పొందుతున్న మహిళలు



మహిళలు తయారు చేసిన బ్యాగులు

- జ్యూట్ బ్యాగుల తయారీతో ఉపాధి
- ఉపాధి హామీలో వందరోజులు పూర్తిచేసిన మహిళలకు శిక్షణ
- సహకారం అందిస్తున్న ఎస్‌బీఐ(ఆర్‌సెటీ), ఉన్నతి
- అవకాశాన్ని వినియోగించుకుంటున్న అతివలు

జూలపల్లి: కుటుంబాలను అన్ని రంగాల్లో ఆర్థికంగా నిలబెట్టుకునేందుకు మహిళలు చేస్తున్న స్వయం సమృద్ధి ప్రయత్నాలు నెరవేరుతున్నాయి. ఇప్పటికే స్వయం సహాయక సంఘాలతో అతివల్లో ఆర్థిక చైతన్యం వచ్చింది. ఉపాధి హామీ పనుల్లో పురుషుల కన్నా మహిళలే ఎక్కువ మంది పాల్గొంటూ కుటుంబాలను ముందుకు నడిపిస్తున్నారు. అలాంటి వీరికి ఎస్‌బీఐ, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఆర్‌సెటీ) కరీంనగర్ బ్రాంచ్ స్వయం ఉపాధిలో మహిళలకు శిక్షణనిచ్చి ఉపాధికి తోడ్పాటు నందిస్తోంది. మండలంలో ఉపాధి హామీ పథకంలో మూడేళ్లలో (ఏదైనా ఏడాది) వంద రోజులు పని పూర్తి చేసిన కుటుంబాలకు చెందిన మహిళలను ఎంపిక చేసి జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ ఇస్తోంది.

మండల కేంద్రంలో 30 మందికి శిక్షణ

స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన శిక్షణకు 30 మంది మహిళలను ఎంపిక చేశారు. వారికి 'ఉన్నతి'ద్వారా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల తయారీలో 13 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. వీరి కోసం 24 కుట్టు మిషన్లను ఏర్పాటు చేసి రకరకాల జ్యూట్ బ్యాగులను తయారు చేస్తున్నారు. శిక్షణకాలంలో ఉచిత భోజన వసతితోపాటు ఉపాధి పథకం నుంచి కొంత స్టైఫండ్ ఇచ్చేందుకు అవకాశం కల్పించారు. శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి కల్పించుకునేందుకు మిషన్, మెటీరియల్‌కు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించనున్నారు.

జ్యూట్ బ్యాగుల తయారీ.. మార్కెటింగ్

శిక్షణలో మహిళలకు రోజుకోతీరు జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ కొనసాగుతోంది. తయారు చేసిన బ్యాగులను దుకాణాలకు సరఫరా చేసి ఉపాధి పొందేలా మార్కెటింగ్‌లో తమవంతు సహకారం అందిస్తామని అంటున్నారు. అయితే మహిళలు తయారు చేసిన బ్యాగులు, సామగ్రిని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ముడిసరుకును మహిళలకు సరఫరా చేస్తే మరింత సహకారం అందించినట్లవుతుందని అంటున్నారు. ప్లాస్టిక్‌ను నిరోధించేందుకు ప్రత్యామ్నాయంగా తక్కువ ధరకే దొరికే జ్యూట్ బ్యాగులు పనిచేస్తాయని చెబుతున్నారు.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



జ్యూట్ బ్యాగుల తయారీని త్వరగానే నేర్చుకుంటున్నాం. మేము కుట్టిన బ్యాగులను ప్రభుత్వం కొనుగోలు చేసి మాకు ఉపాధి కల్పించాలి. తయారుచేసిన బ్యాగులను మేమే అమ్ముకోవాలంటే ఇబ్బంది తప్పదు. ముడిసరుకు ఇచ్చి బ్యాగులను కొనాలి. – సత్యవతి, జూలపల్లి

సౌకర్యాలు కల్పించారు



ఎంపీడీవో కార్యాలయంలో మాకు అన్ని సౌకర్యాలు కల్పించి జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ ఇస్తున్నారు. అందరం బ్యాగుల తయారీని నేర్చుకుంటున్నాం. పూర్తిగా నేర్చుకున్న తర్వాత కుట్టుమిషన్, ముడిసరుకు కోసం రుణం ఇప్పించాలి. – కే.రజనీ, కుమ్మరికుంట

బ్యాగుల తయారీలో శిక్షణ



మహిళలకు రకరకాల జ్యూట్ బ్యాగుల తయారీలో మాకిచ్చిన టాస్క్ మేరకు నేర్పిస్తున్నాం. రోజుకో రకమైన బ్యాగును తయారు చేస్తున్నారు. అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. 24 కుట్టు మిషన్లపై 13రోజుల్లోపే బ్యాగులను తయారు చేస్తారు. – నస్రీన్, కరీంనగర్

మార్కెటింగ్ అవగాహన కల్పిస్తున్నం



మహిళలకు మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తున్నాం. నూతన డిజైన్లు తయారు చేస్తే మార్కెటింగ్‌కు ఇబ్బంది ఉండదు. ఇంటివద్దకే కొనుగోలుదారులు వచ్చి తీసుకెళ్తారు. మహిళాసంఘాల ద్వారా బ్యాంకులు రుణం ఇస్తాయి. శిక్షణ తరువాత ఉపాధి పెంచుకోవాలి. – తిరుపతి, కోర్సు కో–ఆర్డినేటర్

మృతదేహంతో నిరసన



చర్చిస్తున్న గ్రామపెద్దలు

ఎలిగేడు: మండలంలోని శివుపల్లి శివారులో తన పొలంలో అనుమానాస్పదంగా చనిపోయిన దుగ్యాల వెంకట్రావు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించకుండా కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వెంకట్రావు తండ్రి హన్మంతరావు పేరిట ఉన్న ఆరెకరాలను వెంకట్రావు రెండోభార్య విజయ పట్టా చేసుకుందని, ఆ భూమిని తన ఇద్దరు కూతుళ్ల పేరిట రాసివ్వాలని మొదటి భార్య సమత, ఇద్దరు కూతుళ్లు మనుశ్రీ, శ్రేష్ఠ బంధువులతో కలిసి శవాన్ని హన్మంతరావు ఇంట్లో ఉంచి నిరసన తెలిపారు. మనుశ్రీ, శ్రేష్ఠ పేరిట పట్టాచేస్తానని అంగీకరించిన విజయ.. పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వకుండా ఒకసారి కరీంనగర్‌లో ఉన్నాయని, మరోసారి బంధువుల వద్ద ఉన్నాయని చెబుతుండడంతో తమకు న్యాయం జరిగేవరకూ అంత్యక్రియలు చేయబోమని భీష్మించుకూర్చున్నారు. ఘటనస్థలానికి జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ చేరుకున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వారి సమస్య పరిష్కారం అయితేనే అంత్యక్రియలు జరిగే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

ఇసుక క్వారీలో పడి గిరిజనుడి మృతి



కొమురయ్య (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్: మానేరు నది ఇసుక క్వారీలో పడి ఓ గిరిజనుడు మృతి చెందిన ఘటన మండలంలోని కిష్టంపేటలో శనివారం వెలుగుచూసింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన బండి కొమురయ్య మండలం పెద్దరాతుపల్లిలో బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి వెళ్తుండగా మానేరు నది దాటే క్రమంలో ప్రమాదవశాత్తు ఇసుక క్వారీలో పడిపోయాడు. కుటుంబసభ్యులు చూస్తుండగానే కొమురయ్య నీటిలో మునిగి విగతజీవిగా మారాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కాల్వశ్రీరాంపూర్ ఏఎస్సై రఘు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో బీజేపీ నాయకుడు మృతి



వెంకన్న (ఫైల్)

ధర్మారం: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు మురికి వెంకన్న (55) శనివారం గుండెపోటుతో మరణించాడు. గ్రామ శివారులోని తన మామిడితోటకు వెళ్లిన వెంకన్న గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడి వద్ద ప్రథమ చికిత్స అందించి కరీంనగర్‌కు తరలించారు. మార్గంమధ్యలోనే వెంకన్న మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్న వెంకన్న కుమారుడు రాజశేఖర్ ఇటీవలే అనారోగ్యంతో మరణించాడు. రెండు నెలల వ్యవధిలోనే తండ్రీకొడుకులు మృతిచెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

ముత్తారం హెల్త్ అసిస్టెంట్‌పై దాడి..?

మంథని: ముత్తారం మండలకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి హెల్త్ అసిస్టెంట్ పసుల శ్రీనివాస్‌పై రోగి బంధువు దాడి చేసినట్లు సమాచారం. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి క్రిమి సంహారక మందుతాగగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆ సమయంలో వైద్యుడు అందుబాటులో లేరు. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ చికిత్స అందిస్తుండగా రోగి బంధువు దాడి చేసినట్లు సమాచారం. ఈ మేరకు శ్రీనివాస్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

రేపు అంగన్‌వాడీల దేశవ్యాప్త నిరసన

పెద్దపల్లిరూరల్: ఐసీడీఎస్ ప్రాజెక్టు నిర్వహణకు కేంద్రప్రభుత్వం నిధులు పెంచాలని, నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఈనెల 10న అంగన్‌వాడీ ఉద్యోగులు దేశవ్యాప్త నిరసన చేపడుతున్నారని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వనజారాణి, ప్రధాన కార్యదర్శి జ్యోతి తెలిపారు. కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని సూచించారు. అంగన్వాడీలు నల్ల చీరలు కట్టుకుని కలెక్టరేట్ వరకు పాదయాత్రగా తరలిరావాలన్నారు.

ఏఎల్‌పీ గని సందర్శన



ఏఎల్‌పీ గనిలో వివరాలు తెలుసుకుంటున్న ఆర్‌అండ్‌డీ జీఎం సుభాని

కమాన్‌పూర్: అడ్రియాల ప్రాజెక్టు పరిధి ఏఎల్‌పీ గనిని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్‌డీ) జీఎం ఎస్‌డీఎం.సుభాని శనివారం సందర్శించారు. గనిలోపలికి దిగి వెంటిలేషన్, లాంగ్‌వాల్ డెవలప్‌మెంట్‌తోపాటు వివిధ యంత్రాల పనితీరు, పని ప్రదేశాలను పరిశీలించారు. పని వివరాలను ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు వివరించారు. గనిలోకి గాలి సరఫరా పెంచాలని, ఇందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. జీఎం వెంట ప్రాజెక్టు ఇన్‌చార్జి జనార్దన్, ప్రాజెక్టు ఇంజినీరు రఘురాం, ఎస్‌వోఎం తిరుపతి, రక్షణాధికారి రమేశ్, సర్వే అధికారి నారాయణ, శ్రీధర్ ఉన్నారు.

నలుగురికి కారుణ్య నియామక పత్రాలు



నియామక పత్రాలను అందిస్తున్న ఏపీఏ జీఎం

కమాన్‌పూర్: ఆర్జీ–3 ఏరియా నలుగురికి కారుణ్య నియామక పత్రాలను శనివారం ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు అందించారు. జీఎం మాట్లాడుతూ ఉద్యోగాలు పొందిన వారు విధులకు సక్రమంగా హాజరవుతూ సంస్థకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకయ్య, అధికారుల సంఘం ప్రతినిధి వెంకటేశ్వర్లు, డీవైపీఎం మారుతి, పీవో రాజేశం, సాయికృష్ణ ఉన్నారు.

పెండింగ్ సమస్యలపై కలిసికట్టుగా పోరాడాలి

కమాన్‌పూర్: పెండింగ్ సమస్యలపై కలిసికట్టుగా పోరాడి సాధించుకోవాలని సింగరేణి ఆర్జీ–3 ఏపీఏ ఏరియా సింగరేణి అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు సూచించారు. సంఘం సాధారణ సమావేశాన్ని శనివారం సెంటనరీకాలనీలోని సీఎస్‌సీవోపీ క్లబ్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సింగరేణి మెడికల్ కళాశాలలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఏడు సీట్లు కేటాయించడంపై సీఎం కేసీఆర్, సీఎండీ శ్రీధర్, డైరెక్టర్ బలరాం, అధికారుల సంఘం అధ్యక్షులు జక్కం రమేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో అధికారుల చార్జిషీట్ సమస్య పరిష్కరించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో గ్రంధి శ్రీనివాసరావు, చిలుక శ్రీనివాస్, చంద్రమౌళి, తివారి, రాజేందర్, వెంకటరమణ, కోల శ్రీనివాస్, కన్న కిషన్ కుమార్ ఉన్నారు.

రైల్వేగేట్ పడకపోయి ఉంటే..

- కూతురును చూసేందుకొచ్చిన తండ్రికి గుండెపోటు
- కరీంనగర్ తరలిస్తుండగా పడిన రైల్వేగేట్
- సకాలంలో చికిత్స అందక మృతి
- కన్నీరుమున్నీరైన కూతురు, కుటుంబసభ్యులు



రోదిస్తున్న కుటుంబసభ్యులు



భూపెల్లి విజయ్

ధర్మారం: కూతురు గురుకులం విద్యాలయంలో పదోతరగతి చదువుతోంది. రెండో శనివారం కావడంతో విద్యాలయంలో పేరెంట్స్‌డే నిర్వహించారు. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురును చూసేందుకు ఆ తండ్రి విద్యాలయానికి వచ్చాడు. ఇంటినుంచి తీసుకెళ్లిన ప్రత్యేకమైన వంటకాలు కూతురుకు తినిపించాడు. అంతలోనే విధి వక్రీకరించిందేమో.. ఆ తండ్రి గుండెపోటుతో అల్లాడిపోయాడు. వెంటనే పాఠశాల సిబ్బంది అతడిని కరీంనగర్ తరలించారు. అక్కడ మరోసారి విధి అతడిని చిన్నచూపు చూసింది.. అప్పుడే కరీంనగర్ వద్దగల రైల్వేగేట్ పడింది. సుమారు 15 నిమిషాలు ఆలస్యమైంది. ఆసుపత్రిలో చేర్చగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు.. మండలంలోని మల్లాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం విద్యాలయంలో జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన భూపెల్లి విజయ్, సుధీవన కూతురు స్పందన పదో తరగతి చదువుతోంది. రెండో శనివారం కావడంతో విద్యాలయంలో పేరెంట్స్‌డే నిర్వహించారు. దీంతో విజయ్, సుధీవన దంపతులు ఉదయమే కూతురు కోసం ప్రత్యేకమైన వంటకాలు తయారు చేసుకుని విద్యాలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం కూతురుతో కలిసి భోజనం చేశారు. అదే సమయంలో వర్షం రావడంతో ప్రిన్సిపాల్ గిరిజ తల్లిదండ్రులందరినీ హాల్‌లోకి రావాలని సూచించారు. హాల్‌లోకి వచ్చి విజయ్ కూర్చుంటున్న క్రమంలోనే కుప్పకూలిపోయాడు. గమనించిన ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ సుంచు మల్లేశం, విజయ్ భార్య సుధీవన చికిత్స కోసం అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించారు. కరీంనగర్ వద్ద ఉన్న రైల్వేగేట్ అప్పుడే పడటంతో సుమారు 15 నిమిషాలపాటు విజయ్ అంబులెన్స్‌లోనే కొట్టుమిట్టాడాడు. తీరా ఆసుపత్రిలో చేర్చ.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కరీంనగర్‌లో గేట్ పడకుంటే విజయ్ బతికేవాడని మల్లేశం తెలిపారు. మృతదేహం వద్ద కూతురు స్పందన రోదించిన తీరు కలచివేసింది. కుటుంబసభ్యులు, రోదనలతో స్తంభంపల్లిలో విషాదం నెలకొంది.

అయ్యప్ప ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న సజీవ్ నంబూద్రి గురుస్వామి

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళకు చెందిన సజీవ్ నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో అష్టద్రవ్య, గణపతి, భాగ్యసుఖ, సంవాదసూక్తి, తిల తదితర హోమాలు, పంచామృత, అష్టోత్తర 108 కలశాలతో అభిషేకాలు జరిపించారు. ఆలయ కమిటీ అన్నదానం చేసింది. కార్యక్రమంలో ఆలయ ప్రధాన గురుస్వామి అద్దెంకి సారంగాచారి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, కండెం సురేష్, ఈశ్వర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ట్రినిటీలో సీఎస్సీ కోర్సుకు అనుమతి



వివరాలు వెల్లడిస్తున్న అకడమిక్ డైరెక్టర్ అశోక్

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి డిప్లొమా సీఎస్సీ కోర్సు ఫైనల్ ఫేస్ పాలిసెట్ కౌన్సెలింగ్‌కు అనుమతి లభించిందని కళాశాల అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. కళాశాల 2008లో బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, డిప్లొమా డిగ్రీ కోర్సులతో ఆరంభమైందని, ఇపుడు డిప్లొమా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ కోర్సుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ఎస్బీటెట్ అనుమతి పొందామని వివరించారు. పాలిసెట్ తుది దశ కౌన్సిలింగ్‌లో కళాశాల పేరును చేర్చినట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపల్ మణి గణేషన్, ఏవో సురేశ్, రాజిరెడ్డి, హెచ్‌ఓడీలు నటరాజన్, స్వాతి, ప్రభాకర్ తదితరులున్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అలవెన్స్‌లు అమలు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో భాగమైన కాంట్రాక్ట్ కార్మికులకూ అలవెన్స్‌లు వర్తింపజేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ తెలిపారు. శనివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలో కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశమయ్యారు. కాంట్రాక్ట్ కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, వేతనాలు పెంచకుండా కాలయాపన చేస్తూ కార్మికులను మోసం చేస్తున్నాయని తెలిపారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం 22వ జీవోను గెజిట్ చేసి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గట్టయ్య, పోచం, గౌరమ్మ, రాయమల్లు, విజయ, సుగుణ, శంకరమ్మ, సమ్మయ్య, రజిత పాల్గొన్నారు.

ఉద్యోగులు ఐటీ రిటర్న్ సమర్పించాలి



మాట్లాడుతున్న జీఎంలు

కమాన్‌పూర్: ఆర్జీ–3 ఏరియా ఉద్యోగులు ఆదాయ పన్ను రిటర్న్స్ సమర్పించాలని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సూధాకర్‌రావు, వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం జీఎం కార్యాలయంలో మాట్లాడారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రిటర్న్స్ సమర్పించడానికి ఫామ్ 16 అన్ని గనుల డిపార్ట్‌మెంట్ల వద్ద అందుబాటులో ఉన్నాయని, ఈనెల 31లోపు అప్లోడ్ చేసి సమర్పించాలని తెలిపారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ సాధన కోసం ఉద్యమించిన వారి సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అమరవీరులస్తూపం వద్ద శనివారం నాయకులు సత్యనారాయణరెడ్డి, గుండేటి ఐలయ్యతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఆగస్టు 20న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర సాధనలో ఎన్నో ఉద్యమాలు చేసి జైలుకెళ్లినట్లు పేర్కొన్నారు. రాష్ట్రం కోసం కష్టపడిన ప్రతి ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. నాయకులు జ్యోతిరెడ్డి , పటోళ్ల సురేందర్ రెడ్డి, వేల్పుల గట్టయ్య, నూనె రాజేష్, గుడిసె గట్టయ్య యాదవ్, చంద్రకళ, ముస్కె ఈశ్వరమ్మ, దేవేందర్, సుధాకర్, నారాయణ రెడ్డి ఉన్నారు.

డిస్మిస్ కార్మికులకు మరో అవకాశం ఇవ్వాలి



గోదావరిఖని: డిస్మిస్ అయిన కార్మికులకు యాజమాన్యం మరో అవకాశం ఇవ్వాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య శనివారం డైరెక్టర్(పా)కు వినతిపత్రం అందించారు. 2019 నుంచి 2023 వరకు గైర్హాజర్ పేరుతో డిస్మిస్ అయిన కార్మికులకు మరో అవకాశం ఇవ్వాలన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని: సింగరేణివ్యాప్తంగా పేరుకుపోయిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. శనివారం ఆర్జీ–1 డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జి.రాములు, మాతంగి రాయమల్లు, పాయిరాల దుర్గయ్య, చిన్నబోయిన రవీందర్ తదితరులు పాల్గొన్నారు.